# మాతృమూర్తి

శైలేక్

**జ**నని జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరియసీ'' నవలలోని మొదటి వాక్యం ఎంత బాగుంది అనుకున్నాడు రవి.... ఎంతో సట్టువలగా చదువుకు పోతున్న అతనికి ''పోస్టు'' అన్న కేక వినిపించలేదు. పోస్టుమాన్ 'పోస్టు సార్' అంటూ ఒక కవరు విసిరి వెళ్ళిపోయాడు. కవరు విప్పి చూచేసరికి సంతోషంతో తబ్బిబ్బై పోయాడు రవి.

''అమ్మా మిలటరీలో రిక్రూట్‌మెంటుకు ఇంటర్వ్యూ మెమో వచ్చిందమ్మా. ఇంటర్వ్యూ ఎల్లుండి. అంటే రేపే వెళ్ళాలి'' అంటూ హడావిడిగా వంట గదిలోకి వెళ్ళాడు.

''ఏమిటి నాయనా, అంత సంతోషం? ఏమిటసలు?'' ఇంగ్లీషు పదాలు అర్థం గాక మరలా అడిగింది కామేశ్వరమ్మ.

''మిలటరీలో చేరటానికమ్మా. అంటే అదే సైన్యంలోకి చేరటానికి మెమో వచ్చిందమ్మా.''

కామేశ్వరమ్మ కళ్ళు చెమర్చాయి. ఈ కొడుకు కూడ దూరమై పోతాడు. ఈ కళ్ళల్లో అదే ఉత్సాహం. అదే ఆనందం తొణికిస లాడుతున్నాయి. ఆ ఉత్సాహాన్ని తాను నలభై ఏళ్ళ క్రితం చూచింది ఈ కళ్ళల్లో కాదు తన భర్త కళ్ళల్లో, ఆ వీరత్వం, ఆ ఉత్సాహం అన్నీ. అతనివి తండ్రి పోలికలే. రవి పుట్టినప్పుడే అన్నారందరూ అతని తండ్రి పోలికలే అని. ''నా కొడుకు కూడ నా అంతటి వీరుడు కావాలే అదే నా కోరిక'' అన్నారు.

భర్త ఆనాడు అన్న ఆ మాటలు గుర్తుకు వచ్చాయి కామేశ్వరమ్మకు.

కొడుకులోని ఉత్సాహం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది తనకు. కాని పంపటం ఎలా? యుద్ధభూమి అంటే ఏమిటి? మృత్యుద్వారం. ఆలోచనలతో సతమతమై పోతున్నది కామేశ్వరమ్మ.

ఇవేమీ పట్టించుకోకుండా''ఏం అమ్మా, అన్నీ రెడీ చేయి. ప్రొద్దునే వెళ్ళాలి'' అంటూ బయటకు వెళ్ళిపోయాడు రవి.

''సరే' అనుకొంటూ తల్లి మరల తన పనిలో నిమగ్నమై పోయింది.

* * *

రవి ఇంటర్వ్యూ కెళ్ళాడు ఎంతో మంది యువకులు తండోప తండాలుగా వస్తున్నారు. ఆఫీస్ రూముకు రెండు ఫర్లాంగుల వరకు జనం నిండిపోయారు. ఇంతమందిని చూచేసరికి రవికి అను



మానం వచ్చింది 'అసలు తనకు ఛాన్సు లభిస్తుందా' అని. తన పేరు ఎప్పుడు వినపడుతుందా అందరితోపాటు తాను ఎదురు చూడ సాగాడు. ఇంతలో మైక్‌లో 'మిస్టర్ రవి' అని వినబడింది. అతని ఆనందానికి హద్దుల్లేవు. గబగబా ముందుకు నడిచాడు.

"నమస్తే సార్" వినయంగా చేతులు జోడించాడు.

"నీ పేరేనా రవి?" ఆఫీసరు కంఠం కంచులా మ్రోగింది.

"ఎస్ సార్."

"యువర్ ఛేస్ట్ ప్లీజ్" అని చెపుతో రవి ఛాతీ ఆఫీసరు కొలుచుకున్నాడు. "గుడ్, కావలసిన దానికంటె ఒక ఇంచి ఎక్కువే ఉన్నావు. నీ హైట్" అని

ఎత్తూ కొలిచాడు.

"ఆల్ రైట్, అన్నీ సరిపోయాయి. నీ తండ్రిగారి పేరేమిటి?" కలం తీస్తూ వ్రాసుకోవటానికి అడిగాడు ఆ ఆఫీసరు.

"ప్రతాపరావుగారు సార్."

"ఆయన వృత్తి?"

"ఆయన ఇప్పుడు లేరుసార్. నాల్గేళ్ళ క్రిందట పాకిస్తాన్—ఇండియా మధ్య జరిగిన యుద్ధంలో పోయారు సార్" గంభీరంగా అన్నాడు రవి.

"అయితే మీ తల్లి ఉందా?"

"ఉన్నది సార్."

"ఆవిడ వయస్సు?"!

"ఏభై ఎనిమిది ఏండ్లు."

"మీ ఇంటిలో నీ కంటే పెద్ద వారెవరన్నా ఉన్నారా?" రికార్డులో నోట్ చేసికొంటూ అడుగుతున్నాడు.

"ఎవరూ లేరు సార్.... నేను మా మదరే ఉంటున్నాం"

"నీకు అన్నదమ్ములు కూడా లేరా?" వెంటనే తల యెత్తి ప్రశ్నించాడు ఆఫీసర్.

"లేరు సార్,"

సైనికాధికారి బాధగా తల దించుకొన్నాడు. రవి ఆతురతగా ఆయన వైపు చూస్తున్నాడు,

"సారీ మిస్టర్, నిన్ను చేర్చుకోలేను"

నెత్తిన పిడుగు పడినట్లయింది రవికి. తాను కట్టుకున్న ఊహా సౌధాలన్నీ కూలిపోయాయి. అప్పటి దాకా ఎంతో ఉత్సాహంగా నున్న అతని ముఖం పాలిపోయింది.

"వై సార్" అని గట్టిగ అరిచాడు.

"మీ తల్లి వృద్ధురాలు ..."

"అఫ్ కోర్స్. ఆవిడ వృద్ధురాలైతే ఏం, నేను యువకుణ్ణేగా" అర్ధంగాక ప్రశ్నార్ధకంగా ముఖం పెట్టి అడిగాడు.

"అది కాదాయ్. యు ఆర్ పెర్ పెక్టలీ ఫిట్. (You are perfectly fit) కాని నువ్వు మీ తల్లికి సాయంగా ఉండాలి. బ్రదర్సు గాని సిస్టర్సుగాని ఎవ్వరూ లేరని చెప్పావు. మీ తల్లి జీవించినంత కాలం మీ తల్లికి దగ్గరే తల్లికి సాయం చేస్తూండటం నీ ధర్మం ఇది నీ కర్తవ్యం...."

తర్వాతి మాటలేమీ రవికి వినిపించడం లేదు. మారు పలుకలేక పోయాడు. తాను కట్టుకున్నవి గాలిమేడలు అని తెలిసింది. నీరసంగా బరువుగా అడుగులు వేస్తూ రూము బయటకు వచ్చాడు.

"రేయ్ ఆ ఫేస్ (face) తెలియటంలా? ఇప్పటికి ఎనభై ఒకటి"అన్నారు నెవరో సంతోషంగా గుంపులో. ఆ వేమీ వినబడలేదు రవికి. అతని చెవుల్లో మారు మ్రోగుతున్నవి రెండే రెండు పదాలు—ధర్మం, కర్తవ్యం. "మీ తల్లికి సాయం చేస్తూండటం నీ ధర్మం....ఇది నీ కర్తవ్యం."

కర్తవ్యం—కోరిక

ఇవి రెండూ రెండు సమ ఉజ్జీలు, మానవుడు ఎటు మ్రొగ్గాలి? కర్తవ్యం

నిర్వహించాలా? కోరిక తీర్చుకోవాలా! సాధారణంగా మానవుడు రెండిటి మధ్య ఫుట్ బాల్ వలె ఎగురుతూ వుంటాడు చివరకు ఏమి పడతాడు? ఎటు పడాలి? తెలియదు కోరికను నాశనం చేసుకొన లేడు అటు కర్తవ్యాన్ని చేతులారా విస్మరించలేడు ఈ పరిస్థితిలో ఉన్నాడు రవి

* * *

అమ్మా నన్ను చేర్చుకోలేదమ్మా రవి వస్తూనే నీరంగా చెప్పాడు

ఏం నాయనా? బంగారంలా ఉన్న నిన్ను చేర్చుకొనటానికేం? తల్లి ఆశ్చర్యంగా అడిగింది

అవునమ్మా బంగారం లాగానే ఉన్నాను అన్నిటికి సరిపోయానని గూడ అన్నాడమ్మా ఆఫీసరు

అయితే ఇంకేం?

మీ తల్లి వృద్ధురాలు ఆవిడ జీవించినంతకాలం ఆవిణ్ణి కనిపెట్టుకొని ఉండాలి అందుకని సైన్యంలో చేర్చుకోను అన్నాడమ్మా

నేను ముసలిదాన్నైతే ఏం నాయనా? నా పని నేను చేసుకొనగలనులే నీలాంటి యువకు లందరు నాలాంటి వాళ్ళ దగ్గర కూర్చుంటే ఇంకెలా? రేపీ పాటికి చైనా వాళ్లు ఇద వచ్చి కూర్చుంటారు వెళ్ళి సైన్యంలో చేరు పో నాయనా! అవహాయకంగా అన్నది తల్లి

నేను చేర్చుకోలేను అని ఖచ్చితంగా చెప్పేశాడమ్మా

నేను ఒప్పుకున్నానని నేనే పంపానని చెప్పు నాయనా తప్పకుండా చేర్చు


# దీర్ఘరోగులకు ఉత్తమ వైద్యము



హస్త ప్రయోగం అంగము చిన్నదగుట సంభోగ కాలమందు అకస్మాత్తుగా స్ఖలించి అసంతృప్తి చెందుట శుక్లనష్టము నపుంసకత్వము (ఒక డోస్‌తో ఎన్నడు కనివిని ఎరుగనంత వీర్యస్థంభన కల్గి హాయినిచ్చును స్త్రీనికోరు ప్రతి పురుషుడు వాడతగినది వ్యస్తులు) ఉబ్బసము (దమ్ము) బోదకాళ్ళు కుష్ఠు బొల్లి చర్మవ్యాధులు కడుపునెప్పి చెవుడు పోస్టుద్వారా గ్యారంటీ చికిత్స చేయబడును

**శ్రీబాలాజీ వైద్యశాల, డా: పి కుమారస్వామిదేవర**

**ట్రావెలర్సు బంగళారోడ్, తెనాలి (ఎ పి)**

కొంటారు. నాలాటి వాళ్ళందరు రేపో మాపో పోతారు. అప్పుడు దేశం బాగోగులు చూడవలసినవాళ్ళు నీలాటి యువకులే నాయనా! మేమేం చేస్తాం?'' చదువు లేక పోయినా ఆప్యాయత, అనురాగాలే కాకుండా దేశభక్తి కూడ ఉట్టిపడుతున్నాయి ఆ మాటల్లో.

''కాదమ్మా లాభం లేదు. ఎన్ని చెప్పినా వినలేదు. నీ దగ్గరే ఉంటాను. ఆయన చెప్పినది కూడ నిజమేగా. ఎప్పుడు నీ దగ్గరే ఉంటానమ్మా. ఇది నా కర్తవ్యం' అని తృప్తిగాను గంభీరంగాను అన్నాడు రవి.

ఆ తల్లికేం చేయాలో బోధపడటం లేదు. 'నా వల్ల అన్ని యోగ్యతలున్న నా కొడుకు సైన్యంలో చేరలేదు.'

* * *

గోడ గడియారం మూడుసార్లు రంగు రంగు మన్నది.

''బాబూ, రవీ, డ్రాయరు సొరుగులో రెండు రూపాయలున్నాయి. అది తీసికొని వెళ్ళి కూరగాయలు తీసికొని రా నాయనా, ప్రొద్దు పోతోంది'' అని వంట గదిలో నుంచి తల్లి కేకేసింది.

చేతిలో నున్న పుస్తకం డ్రాయరు మీద పడేసి లేచాడు రవి. డబ్బులు తీసి 'అలాగే నమ్మా' అంటూ వెళ్ళిపోయాడు. ఒక అర గంటలో కూరలతో సహా తిరిగి వచ్చాడు. తలుపులు తను వెళ్ళేటప్పుడు ఎలా లేసి ఉన్నాయో అలానే ఉన్నాయి. తలుపులు త్రోసికొని సరాసరి వంట గదిలోనికి వెళ్ళాడు. అక్కడ తల్లి లేదు. సంచి అక్కడే పెట్టి, 'అమ్మా' అని కేక వేసాడు. ఏమీ జవాబు రాలేదు. ఎందుకు వస్తుంది జవాబు??? ప్రక్కింటికి వెళ్ళింది కాబోలు' అని అనుకొని వసారాలోకి వచ్చాడు. ఏం చేయాలో తోచలేదు. మరలా నవల తీసికొని కుర్చీలో కూలబడ్డాడు గంట గడిచిపోయింది. కాని ఇంకా చదువుకు పోతున్నాడు.


అయిదు గంటలు కొట్టింది గడియారం నిశ్శబ్దాన్ని చీలుస్తూ—

''రవీ'' అంటూ వచ్చాడు వేణు.

''ఏరా నువ్వు సెలక్టు అయ్యావా?'' అని ప్రశ్నించాడు రవి.

''అది సరేగాని ఒక్క పాతిక రూపాయలు కావాలి. అర్జంటయిన అవసరం వచ్చింది. వారం రోజుల్లో ఇచ్చేస్తానురా. మూర్తి దగ్గరకు వెళ్తే అసలు లేదన్నాడు. నిన్న నా ముందుగానే ఎమ్. ఒ. అందుకున్నాడు. రేయ్ లేదనకురా ప్లీజ్. ఎంతో ఆశతో వచ్చాను'' బ్రతిమాలాడు వేణు.

''ఇస్తాను కూర్చో.'' అంటూ కుర్చీలో నుంచి లేచాడు. డబ్బుకోసం గదిలోకి వెళ్ళబోయాడు. తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి. గుమ్మం వరకు వచ్చాడు. వంట గదిలో ఏమీ అలికిడి లేదు. అన్నం గాబోలు మాడిన వాసన వస్తోంది. వెనక్కు తిగిరి వంట గదిలోనికి వెళ్ళాడు. అక్కడ




అమ్మలేదు. తాను పెట్టిన సంచి అలానే ఉంది. అన్నం దించి, డబ్బుకో సంతిరిగి గదిలోనికి వెళ్ళాడు.

"అమ్మా" అని బావురు మన్నాడు రవి. తల్లి అక్కడ పడిపోయి ఉంది. ప్రక్కనే స్లీపింగ్ పిల్స్ బోటిల్ ఉంది. తల్లి తల తట్టుకొని "ఏమిటమ్మా. ఏంటమ్మా ఇది? ఎలా వున్నదమ్మా' అని పిచ్చిగాఅరుస్తూ అమ్మను కుదుపుతున్నాడు. జవాబు లేదు కదా, మూలుగన్నా విన బడటం లేదు. శరీరం చల్లగా ఉంది.

'అమ్మా! అమ్మా' అని పెద్దగా ఏడ్వ సాగాడు.

ఈ అరుపులు విని ఏమిటో అని కంగారుగా లోపలకు వచ్చాడు వేణు.

"అమ్మా, ఒక్కసారి పలుకమ్మా. ఎన్నిసార్లు పిలిచినా పలకవేం అమ్మా!" అంటూ అమ్మని కదిపి ఏడుస్తున్నాడు రవి. వేణు ఆవిడ చేయ పట్టుకు చూచి 'అయిపోయిందిరా' అన్నాడు బరువుగా.

*　　　*　　　*

రెండు రోజు లయిపోయాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. రవి కుర్చీలో దిగాలుగా కూర్చున్నాడు. అప్పుడప్పుడు పుస్తకాలు సర్దుతూ వేణు ఏదో మాట్లాడుతున్నాడు.

"రవీ, ఇదేంటో ఏదో ఉత్తరంరా" అంటూ బల్ల మీదున్న ఒక కాగితం రవి చేతికిచ్చాడు.

"ఇప్పు డెందుకురా, అవన్నీ, అలా పడేయి" అంటూనే అందుకున్నాడు. అది తన అమ్మ దస్తూరి. ఏమిటో అని ఆతురతగా చదివాడు.

'రేయ్ వేణూ, మా అమ్మ ఎంత పని చేసిందో చూశావా?'' రవి బాధగా అన్నాడు.

''ఏమిటిరా?'' అంటూనే లేచి వచ్చాడు వేణు రవి దగ్గరకు.

''ఇది చూడు'' ఉత్తరం వేణు కిచ్చాడు.

వేణు అందుకొని చదువ సాగాడు—''చిరంజీవి రవికి

అమ్మ ఆశీర్వదించి వ్రాయునది—

నాయనా, నా వలన నిన్ను మిలటరీలో చేర్పించుకొనలేదు. కాని నాలాటి వృద్ధులు దేశంలో చాల మంది ఉన్నారు. వాళ్ళ కొడుకు లందరు నీ వలె సైన్యంలో చేరక పోతే దేశం ఏమవుతుందో తెలుసా? నీ లాటి యువకు లందరు తల్లుల దగ్గర కూర్చుంటే గాంధీజీ, నెహ్రూజీ, పటేలు లాంటి గొప్ప గొప్ప నాయకులు సంపాదించి ఇచ్చిన మన స్వాతంత్ర్య లక్ష్మి ఏమవుతుందో తెలుసా? నాయనా, స్వాతంత్ర్యం సముపార్జన కంటె స్వాతంత్ర్య సంరక్షణ కష్టం. ఆ బాధ్యత మీపైన ఉన్నది. నేటి యువకులే రేపటి అధినేతలు. నేను జీవించి ఉండటం వలన నీవు సైన్యంలో చేరకూడదన్నారు. ఇప్పుడు నీవు నిశ్చింతగా పోయి సైన్యంలో చేరి నీ మాతృభూమిని కాపాడుకో. అదే నాకు ఆత్మశాంతి కలిగిస్తుది. తప్పక చేరి నీ మాతృదేశ ఋణం తీర్చుకో. మీ నాన్న గారి కోరిక గూడ అదే. ఒకనాడు ఏమన్నారో తెలుసా—'నా కొడుకు కూడ నా అంత వీరుడైతే చూడాలని ఉంది' వారి కోరిక గూడ తీర్చు. అదే నాకు మహాద్భాగ్యం. నా కొరకు ఒక వీరుడయి నన్ను 'వీర మాత'గా పేరు పొందనీ. ఆ అదృష్టం నాకు దక్కనీ.

—ఆశీర్వాదములతో

నీ అమ్మ.''

ఉత్తరం పూర్తిచేసి చూసేసరికి రవి తల పట్టుకొని ఏడుస్తూ కూర్చున్నాడు.

''రేయ్ రవీ, ఇప్పుడు ఏడ్చి లాభం లేదురా. నువ్వు చేయవలసిందల్లా ఒక్కటే అదే—మీ అమ్మ కోర్కెను తీర్చాలి. అది నీ ధర్మం అంతేగాని విచారిస్తే లాభం లేదు. అందరు తల్లులు మాతృమూర్తులు. కాని మీ అమ్మ దేవతా మూర్తి. అ దేవతామూర్తి ఆశయం నెరవేర్చు. ఆమెకు ఆత్మశాంతి కలగనీ. నువ్వు అటువంటి మహిమాన్విత మూర్తికి కొడుకుగా పుట్టినందుకు ఆమె కడసారి కోరిక తీర్చు. లే'' అంటూ వేణు ప్రోత్సాహ మిచ్చాడు.

''నిజమే. అమ్మ కోరిక తీర్చాలి. నడు పోదాం. ఇంకో రెండు రోజులు టైముంది గా. పద'' గంభీరంగా అన్నాడు రవి.

ఎదురుగా పుస్తకం మీదున్న శీర్షిక కర్తవ్యాన్ని ప్రభోదిస్తున్నట్లుంది. ''జననీ జన్మ భూమిశ్చ స్వర్గా దపి గరియసీ.''